సాక్షి నిర్మల్

గురువారం । 7 । సెప్టెంబర్ । 2023



వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

జిల్లావ్యాప్తంగా బుధవారం శ్రీకృష్ణాష్టమిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఉట్టి వేడుకలు నిర్వహించగా యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 9లో▸

సర్టిఫికెట్ల పరిశీలన

నిర్మల్: తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ద్వారా పలు ఉపకరణాలను పొందేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నవారి సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు జిల్లా సంక్షేమశాఖ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. రెట్రోఫిట్టెడ్ మోటార్‌వెహికల్ కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 12న, బ్యాటరీ వీల్‌చైర్, ల్యాప్‌టాప్, డైసీప్లేయర్, 4జీ స్మార్ట్‌ఫోన్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 13న ఉదయం 11గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో సమీకృత కలెక్టరేట్‌కు రావాలని సూచించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0 /24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశముంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రి, పార్క్ పరిశీలన



అర్బన్‌పార్క్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. ఆస్పత్రి అభివృద్ధి పనుల ప్రతిపాదనల గురించి సూపరింటెండెంట్ వంశీమాధవ్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణ శివారులోని అర్బన్‌ఫారెస్ట్‌ను సందర్శించారు. ఎఫ్ఆర్వో వినాయక్‌తో మాట్లాడి పార్క్ పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ పరిమల్ బౌమిక్ తదితరులున్నారు.

వీవోఏలతో డీఆర్డీవో సమీక్ష

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో డీఆర్డీవో విజయలక్ష్మి బుధవారం వీవోఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా సభ్యులకు సకాలంలో బ్యాంక్ రుణాలు అందించి సక్రమంగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రిలయన్స్ సౌజన్యంతో సమకూర్చిన కూరగాయల విత్తనాలను 12 గ్రామపంచాయతీల వీవోఏలకు అందజేశారు. పెరటి తోటల సాగుపై అవగాహన కల్పించి ఇంటి ఆవరణలోని ఖాళీ స్థలాల్లో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసుకునేలా చూడాలని సూచించారు. ఎంఎస్ అధ్యక్షురాలు గంగామణి, ఏపీడీ గోవింద్‌రావు, డీపీఎంలు విజయలక్ష్మి, సాయిప్రసాద్, ఏపీఎంలు వాణిశ్రీ, అర్జాబాయి, సీసీలు దినేశ్, సాయన్న, నరేందర్, సవిత తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్వోగా ప్రమోషన్



నిర్మల్: ఇన్‌చార్జి డీపీఆర్వో తిరుమలకు డీపీఆర్వోగా ప్రమోషన్ కల్పిస్తూ సమాచార పౌర సంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం తిరుమలకు ఉత్తర్వులు అందజేశారు.

నేరాల నియంత్రణకు సమష్టి కృషిచేయాలి

తానూరు: నేరాల నియంత్రణకు రెండు రాష్ట్రాల పోలీసులు సమష్టిగా కృషి చేయాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. బుధవారం మహారాష్ట్రలోని భోకర్ ఎస్‌డీపీవో కార్యాలయంలో ముథోల్ సీఐ, తానూరు, కుభీర్, భైంసారూరల్ ఎస్సైలు, ఎస్‌డీఎస్పీ అమునాస్, హిమాయత్‌నగర్ సీఐ నానాసాహెబ్‌తో కలిసి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దులో శాంతి భద్రతల పరిరక్షణకు సమావేశం నిర్వహించారు. దేశీదారు అక్రమ రవాణా, ఆస్తి నేరాలు, నాన్ బెయిలబుల్ వారెంట్ ఉన్నవారు, గుర్తుతెలియని మృతదేహాలు, మిస్సింగ్ కేసులు తదితర అంశాలపై చర్చించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల వివరాలు అక్కడి అధికారుల ద్వారా తెలుసుకున్నారు. సరిహద్దులో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాష్ట్రస్థాయి మేళాకు ఎంపిక



విద్యార్థులతో ఉపాధ్యాయులు

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ సుభద్ర నిలయం విద్యార్థులు రాష్ట్రస్థాయి విజ్ఞానమేళాకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ తెలిపారు. ఈనెల 3, 4 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి గణిత విజ్ఞాన మేళాలో వేదగణితం, సైన్స్, గణిత ప్రయోగాలు, వర్షపు నీటి సంరక్షణ తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన 30 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి మేళాకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఈ నెల 12, 13, 14 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కమిటీ సభ్యులు అభినందించారు.

9న బాలకవి సమ్మేళనం

ముథోల్: కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన ఉదయం 11.30గంటలకు ముథోల్‌లోని మేధా హైస్కూల్‌లో బాలకవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు హైదరాబాద్ చిమ్మపూడి ఫౌండేషన్ భైంసా శాఖ కన్వీనర్ జాదవ్ పుండలీక్‌రావు పాటిల్ ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనేవారు ఈ నెల 7వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 8, 9, 10 తరగతుల వారు అర్హులని తెలిపారు. వివరాలకు 9441333315 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గుంతల దారులు

అంతా.. గుంతలమయం



ఇది.. గత జూలై 20న 'సాక్షి' జిల్లా పేజీలో ప్రచురించిన కథనం. జిల్లాకేంద్రం పెద్దపెద్ద గుంతల రోడ్లతో ఎంత దారుణంగా ఉందో కళ్లకు కట్టించింది. దీనిపై స్పందించిన బల్దియా రెండు రోజుల్లో మట్టిపోసి గుంతలు పూడ్చింది. కానీ.. అది మూడురోజుల ముచ్చటే అయ్యింది. ఇటీవల కురుస్తున్న వానలకు మళ్లీ పాతకథే పునరావృతమైంది. అవే గుంతలతో నిర్మల్‌వాసులు నిత్యం అవస్థలు పడుతున్నారు.



బస్టాండ్ ప్రాంతంలో ప్రధాన రహదారిపై గుంత పక్క నుంచి వెళ్తున్న వాహనదారులు

- జిల్లాకేంద్రంలో గతుకుల రోడ్లు
- నామమాత్రపు చర్యలు చేపట్టి నరిపెడుతున్న అధికారులు
- నిర్మల్ బల్దియా తీరుపై విమర్శలు
- పట్టణ ప్రజలకు తప్పని అవస్థలు

నిర్మల్: నిర్మల్ మున్సిపాలిటీ చేపడుతున్న పనులు పట్టణవాసులను విస్తుగొల్పుతున్నాయి. ఓవైపు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అభివృద్ధి పనులు చేపడుతుంటే.. కనీసం వాటి నిర్వహణ చేపట్టకుండా బల్దియా గాలికొదిలేస్తోందన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎప్పుడో మూడేళ్లక్రితం చేపట్టిన రోడ్డు వెడల్పు పనులు ఇప్పటికీ 'ఎక్కడ వేసిన గొంగలి.. అక్కడే' అన్నట్లు ఉన్నాయి. ఈ పనుల జాప్యంతో ప్రధానంగా నిర్మల్‌లో పాతబస్తీలుగా చెప్పుకొనే గాంధీచౌక్ ప్రాంతంలోని వీధులు అవస్థలు పడుతున్నాయి. రోడ్లు సరిగా లేకపోవడంతో పాటు డ్రైనేజీల మురుగునీరు రోడ్లపైనే పారుతోంది.

అడుగడుగునా గుంత..

రెండు నెలలు కూడా గడవకముందే పాత కష్టాలు మొదలయ్యాయని పట్టణవాసులు వాపోతున్నారు. స్థానిక పాతబస్టాండ్ నుంచి బుధవార్‌పేట్, శివకోటి మందిరం, కబూతర్ కమాన్, గాంధీచౌక్, జుమ్మెరాత్‌పేట్, నాయుడివాడ, బేస్తవార్‌పేట్ మీదుగా బంగల్‌పేట్ వరకు, అలాగే సోమవార్‌పేట్, గాంధీచౌక్ మీదుగా వెళ్లే రోడ్డూ.. దారుణంగా తయారయ్యాయి. జూన్-జూలైలో వానాకాలం ప్రారంభం కాగానే రోడ్డంతా అడుగడుగునా పెద్దపెద్ద గుంతలు పడ్డాయి. పగటిపూటే జాగ్రత్తగా చూసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపైనే అప్పట్లో 'సాక్షి' కథనాన్ని ప్రచురించి ప్రజల ఇబ్బందులను బల్దియా దృష్టికి తీసుకువచ్చింది.



బంగల్‌పేట్ రోడ్డుపై గుంతలు



గాంధీచౌక్‌లో..

మళ్లీ అదే గతి..

జూలైలో పైపైన మట్టిపోసి చేతులు దులుపుకోవడంతో తాజాగా కురుస్తున్న వర్షాలకు మళ్లీ పాతకథే ఎదురైంది. ఈసారి గుంతలు మరింత పెద్దగా ఉండటంతో ఈ మార్గంలో నిత్యం వెళ్లే వందలాది మంది ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఏళ్లుగా రోడ్డు వెడల్పు పనులు పెండింగ్‌లో ఉంచడం, రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల ఇళ్లను తొలగించడంతో మామూలు సమయాల్లో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇక వానాకాలం నీరు నిలిచి గుంతలు తయారవుతున్నాయని, దోమలు, ఈగలు పెరిగి రోగాలకూ కారణమవుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పనులు ప్రారంభించాం

నిర్మల్ పట్టణంలో పలు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించాం. వర్షాల కారణంగా ప్రస్తుతం పనులు చేపట్టడం లేదు. వానలు తగ్గగానే శాశ్వత బీటీ రోడ్ల నిర్మాణ పనులు కొనసాగిస్తాం.

– సీవీఎన్ రాజు, మున్సిపల్ కమిషనర్

శాశ్వత చర్యలు చేపట్టేనా..!

ఏళ్లు గడుస్తున్నా రోడ్డు వెడల్పు పనులు ఇంకా పూర్తి చేయకపోవడంపై నిత్యం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రోడ్ల పనుల్లో జాప్యం కారణంగా గాంధీచౌక్ చుట్టూ వీధుల్లో చాలామంది డిస్క్, సైనస్, ఆస్తమా సమస్యల బారినపడ్డారు. తరచూ బైక్‌లపై నుంచి జారిపడటంతో పలువురు గాయాలపాలయ్యారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ శాశ్వత పనులు చేపట్టాలని, ఇటీవల సీఎం కేసీఆర్ విడుదల చేసిన నిధుల నుంచైనా రోడ్లు, డ్రైనేజీల పనులు పూర్తిచేయాలని పట్టణవాసులు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికే పనులు ప్రారంభించామని, వానలు తగ్గగానే బీటీ రోడ్లు వేస్తామని చెబుతున్నారు.

తెలంగాణలో ఆలయాలకు మహర్దశ



ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం
- 20మంది జీసీలకు చెక్కుల పంపిణీ

సారంగపూర్: బీఆర్‌ఎస్ హయాంలో తెలంగాణలోని ఆలయాలకు మహర్దశ వచ్చిందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సోనాపూర్ పంచాయతీ పరిధి గోపాల్‌పేట్ తండాలో రూ.10లక్షల దేవాదాయ నిధులతో నిర్మించిన జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలకు బుధవారం మంత్రి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని దాదాపు అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రామారావు, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, ఆలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ మాధవరావు, నాయకులు రాజ్‌మహ్మద్, చందు, గంగారెడ్డి తదితరులున్నారు.

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మంత్రి ఐకేరెడ్డి ఆవిష్కరించారు. అనంతరం రూ.10లక్షలతో నిర్మించిన మున్నూరు కాపు సంఘ భవనం, రూ.10లక్షలతో ఆధునికీకరించిన గురడి రెడ్డి కాపు సంఘాల భవనాలు, రూ.25లక్షలతో నిర్మించిన మోడల్ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మాయాపూర్ పంచాయతీ పరిధిలోని ఒడ్డెపల్లిలో కమ్యూనిటీ భవన నిర్మాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్నారని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. సర్పంచులు ఇట్టెడి గంగారెడ్డి, మహేశ్, ఎంపీపీ పాల్దె అక్షర-అనిల్, బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పీవీ రమణారెడ్డి, అదనపు కలెక్టర్ కిశోర్‌బాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు సుభాష్‌రావు, తహసీల్దార్ డీ సరిత, నాయకులు సంజీవ్‌రెడ్డి, భుజంగ్‌రావు, నరసింహారెడ్డి, నర్సారెడ్డి, రవి తదితరులున్నారు.

రాంపూర్‌లో కల్యాణ మండపం..

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామంలో రూ.50 లక్షల సీజీఎఫ్ నిధులతో నిర్మించిన శ్రీరామాలయ కల్యాణ మండపాన్ని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రిని మండలానికి చెందిన బీ డీ కార్మికులు కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ సుభాష్‌రావు, జెడ్పీటీసీ చిన్నరామయ్య, ఎంపీటీసీలు నడిపొల్ల రవి, మల్లేశ్, సర్పంచ్ గోవింద్‌రెడ్డి, బన్సపల్లి పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, నాయకులు జీవన్‌రెడ్డి, నారాయణ, ప్రవీణ్, నవీన్ తదితరులున్నారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో 20మంది లబ్ధిదారులకు మంత్రి ఐకేరెడ్డి బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఎఫ్ఎస్సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, పారిశ్రామికవేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, లక్ష్మణచాంద జెడ్పీటీసీ రాజేశ్వర్, నాయకుడు అల్లోల సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన



కళ్లకు గంతలతో ర్యాలీ తీస్తున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: తమను రెగ్యులరైజ్ చేయాలని బుధవారం సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు జిల్లా కేంద్రంలో కళ్లకు గంతలు కట్టుకుని ర్యాలీ తీశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. 15రోజులుగా తాము నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు గంగాధర్, ప్రధానకార్యదర్శి రత్నం, సంఘాల బాధ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జలాశయాలకు కళ

లక్ష్మణచాంద: భారీ వర్షానికి మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. చెరువులు మత్తడి దుంకుతున్నాయి. కనకాపూర్ వాగు పొంగి పారుతోంది. పలుచోట్ల పంట చేలలో వాననీరు నిలిచింది.

గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ నీటి విడుదల

భైంసాటౌన్: ఎగువన కురుస్తున్న వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. బుధవారం 1,120 క్యూసెక్కుల ఇన్ ఫ్లో రాగా, ప్రాజెక్ట్ అధికారులు ఒక గేటు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 358.7 మీటర్లు కాగా, ప్రస్తుతం 358.5 మీటర్ల నీటిమట్టం కొనసాగిస్తూ నీటిని విడుదల చేస్తున్నారు.

రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

ఖానాపూర్: మండలంలోని సింగాపూర్ గ్రామం మీదుగా రాజురాకు వెళ్లే మార్గంలో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో రాకపోకలు నిలిచి ప్రజలు, వాహనదారులు ఇక్కట్లు పడ్డారు. సింగాపూర్ సర్పంచ్ రామకృష్ణ రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తీయించారు.



మామడ: కొరిటికల్ సమీపంలో దెబ్బతిన్న రోడ్డు



ఖానాపూర్: రోడ్డుపై విరిగి పడ్డ చెట్టు

కొరిటికల్‌లో కూలిన వంతెన

మామడ: కొరిటికల్ గ్రామ సమీపంలోగల సరస్వతి ఉపకాలువపై ఉన్న వంతెన వర్షానికి కూలింది. రోడ్డు దెబ్బతిన్నది. దీంతో పంటపొలాలకు వెళ్లేందుకు రైతులకు ఇబ్బందిగా మారింది. దెబ్బతిన్న వంతెన, కాలువను నీటిపారుదలశాఖ డీఈ నరేశ్, ఏఈ వీరన్న పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఏనుగు లింగారెడ్డి, గ్రామస్తులున్నారు.

'కడెం'కు ఇన్‌ఫ్లో..

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మంగళవారం16,389 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా ఒక వరద గేటు ఎత్తి 18,035 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 695.950 అడుగుల నీటిమట్టం ఉంది.

ఆలయ దుకాణాలకు వేలం

భైంసా: బాసర ఆలయ ఆవరణలోని 17వ దుకాణానికి బుధవారం ఆలయ అధికారులు వేలం నిర్వహించారు. ఏడాది కాలపరిమితికి రూ.11వేలకు టెండరుదారు దక్కించుకోగా, పూలదండలు విక్రయించే దుకాణానికి తగిన పాట రాకపోవడంతో టెండర్ వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో, అధికారులు పాల్గొన్నారు.

రేపు సామూహిక కుంకుమార్చన

బాసర అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీవ్రతం, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బడుగులపై పిడుగులు!

ఇంటి పెద్ద దిక్కును కోల్పోయి..



పిల్లలతో సునీత

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం నవేగాంకు చెందిన బోయిని మల్లేశ్(35) గత జూలై 4న మేకలు మేపుతుండగా పిడుగుపాటుకు గురై ప్రాణాలిదిలాడు. తనకున్న పది గొర్రెల ఆధారంగానే భార్య సునీత, ముగ్గురు పిల్లల జీవనం సాగేది. ఇంటి పెద్దదిక్కు అకాల మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. కుటుంబ బాధ్యత మల్లేశ్ తండ్రి సాంబయ్యపై పడింది. సర్కారు నుంచి పైసా పరిహారం అందలేదు.

2021, జూలైలో ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలానికి చెందిన దోత్రే శోభ చేనులో పిడుగు పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తండ్రి గతంలోనే అనారోగ్యంతో చనిపోవడంతో ఇద్దరు చిన్నారులు దేవిక, డేవిడ్ అమ్మ, నాన్నలకు శాశ్వతంగా దూరమయ్యారు. ప్రస్తుతం వారి చిన్నమ్మ వద్ద ఉంటూ, చదువుకుంటున్నారు. సర్కారు నుంచి వీరికి ఎలాంటి పరిహారం అందలేదు.

- ఏటా పదుల సంఖ్యలో మృత్యువాత
- ప్రకృతి వైపరీత్యాలతో కుటుంబాలు ఆగం
- పరిహారం అందించడంలోనూ తీవ్ర జాప్యం
- ఉమ్మడి జిల్లాలో బాధిత కుటుంబాల్లో తీరని విషాదం



కౌటాల మండలంలోని ముత్తంపేట గ్రామ సమీపంలో పిడుగు పాటుకు మృతి చెందిన రైతులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాయకష్టం చేసుకుంటూ జీవనం సాగించే బడుగుల జీవితాలను పిడుగులు ఆగం చేస్తున్నాయి. ఏటా వానాకాలంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వీటిప్రభావంతో పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 8 మంది పిడుగుపాటుకు బలయ్యారు. మేకలు, గొర్రెలు, పశువులు మృత్యువాతపడి ఆస్తి నష్టం జరిగింది. పిడుగులకు ఎక్కువగా రైతులు, కూలీలు, పశువులు, మేకల, గొర్రెల కాపరులు బలవుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏ ప్రాంతంలో పిడుగు పడబోతోందో.. హెచ్చరించే వ్యవస్థ అందుబాటులోకి వచ్చినా పిడుగుపాటు మరణాలు కొనసాగుతుండడం గమనార్హం. ఉమ్మడి జిల్లాలో అడవులు, నీటి ప్రవాహాలు, ఎత్తయిన కొండలు ఎక్కువగా ఉండడం, పశువుల కాపరులు, మత్స్యకారులు, రైతులు, కూలీలు వర్షంలోనే పనులు చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.

బాధిత కుటుంబాలకు అందని పరిహారం

ప్రకృతి వైపరీత్యాలకు పరిహారం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.6 లక్షలు ఇస్తున్నాయి. అయితే ఈ పరిహారం పొందేందుకు తహసీల్దార్, ఎస్సై, వైద్యాధికారితో కూడిన కమిటీ పిడుగుపాటుతో చనిపోయినట్లు నిర్ధారణ చేయాలి. ఆ తర్వాత బాధిత కుటుంబాలకు రెవెన్యూశాఖ నుంచి పరిహారం అందుతుంది. అయితే రెండేళ్లుగా ఉమ్మడి జిల్లాలో బాధిత కుటుంబాలకు ఈ పరిహారం అందడం లేదు. మంచిర్యాల జిల్లాలో 2020 నుంచి 2021 మధ్య ఐదుగురికి రూ.6 లక్షల చొప్పున మంజూరైనా నిధుల లేమితో బాధిత కుటుంబాలకు అందని పరిస్థితి. కొన్నిసార్లు పిడుగుపాటుతో మరణించినప్పటికీ అధికారుల లెక్కల్లోకి రాక, బాధితులు పరిహారానికి దూరమవుతున్నారు.

అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

పిడుగుపాటుపై నేటికీ గ్రామీణుల్లో అవగాహన లేమితో మరణాలు జరుగుతున్నాయి. ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తున్నప్పుడు చెట్లు, నీటి ప్రవాహాలు, కొండలు, విద్యుత్ సరఫరా స్తంభాలు, ఎత్తయిన తాటి చెట్లకు దూరంగా ఉండాలి. ఒకే చోట ఎక్కువ మంది గుమిగూడడం, పశువులు, జీవాలు గుంపుగా ఉండొద్దు. ఉరుములు, మెరుపులు వస్తే, ఇంటికి వెళ్లడం లేదా సమీపంలోనే ఉన్న రక్షిత ప్రాంతానికి చేరాలి. బీపీ, గుండె జబ్బులు, ఫిట్స్ వచ్చే వాళ్లు, గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు బయట ఉండొద్దు. పిడుగు పడే సమయంలో అరచేతులతో చెవులు మూసుకోవాలి. నేలపై మోకాళ్ల మీద కూర్చొని తల కిందికి వంచాలి. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, బైక్‌లకు దూరంగా ఉండాలి. ఉరుములు, మెరుపుల సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడొద్దు. గ్రామాల్లో పిడుగులపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సి ఉన్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు.

జిల్లాల వారీగా పిడుగుపాటు మరణాలు (గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్‌వరకు)

ఆదిలాబాద్	01
ఆసిఫాబాద్	04
మంచిర్యాల	02
నిర్మల్	01
మొత్తం	08

లైటెనింగ్ కండెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి



పిడుగు ముప్పు తప్పించుకునేలా ఎత్తయిన భవనాలు, ఇళ్లపై లైటెనింగ్ కండెక్టర్ ఏర్పాటు చేసుకోవాలి. దీనికి పిడుగును ఆకర్షించే గుణం ఉండడంతో ముప్పు తప్పించుకోవచ్చు. లైటెనింగ్ కండెక్టర్‌ను కాపర్‌తో తయారు చేసిన త్రిశులాన్ని ఎత్తయిన కట్టడాల మీద ఏర్పాటు చేస్తారు. ఈ కాపర్ వైర్‌ను భూమికి కలుపుతారు. హై ఓల్టేజ్ ప్రవాహం భూమిలోకి వెళ్లి పోతుంది.

– ఎం.కిశోర్‌కుమార్, భౌతికశాస్త్రం, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల

వానాకాలం ప్రారంభం నుంచే మరణాలు..

- గత ఏప్రిల్‌లో అకాల వర్షం పడి నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాజురాలో మేకల కాపరి మోహన్ (21), మే నెలలో ఆదిలాబాద్ జిల్లా బోథ్‌కు చెందిన మధూకర్ (21) పిడుగులు పడి చనిపోయారు.
- గత జూన్ 11న మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం వెల్గనూరుకు చెందిన కడ్తల గురువయ్య(73) ఊళ్లో పోచమ్మ గుడికి వెళ్లి వస్తుండగా పిడుగు పడి చనిపోయాడు.
- బెజ్జూర్ మండలం పోతేపెల్లికి చెందిన తొడసం పోసక్క(20) ఈనెల 2న పిడుగుపాటుకు బలైంది. పోసక్క మంచిర్యాలలో బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. ఇటీవల రాఖీ పండుగకు ఇంటికి వచ్చింది. స్నేహితురాలైన భూదక్కతో కలిసి చేనులోకి మిరపనారు వేయడానికి వెళ్లింది. సాయంత్రం పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పక్కనే ఉన్న భూదక్కకు తీవ్ర గాయాలయ్యాయి.
- భీమారం మండల కేంద్రంలోని తెనుగువాడకు చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు బండారి లింగయ్య (68) ఈనెల 2న పిడుగుపాటుతో మృతి చెందాడు. బ్యాంక్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పిడుగుపాటుతో అక్కడికక్కడే మృతి చెందాడు.

క్లుప్తంగా

కుంటాలను సందర్శించిన ట్రైనీ ఎఫ్‌బీవోలు



సందర్శనకు వచ్చిన ట్రైనీ ఎఫ్‌బీవోలు

నేరడిగొండ: మండలంలోని కుంటాల జలపాతాన్ని దూలపల్లి ట్రైనీ ఎఫ్‌బీవోలు బుధవారం సందర్శించారు. 33వ బ్యాచ్‌కు చెందిన వీరు జలపాతం అందాలను తిలకించి ఆహ్లాదాన్ని పొందారు. ఈ సందర్భంగా సిరిచెల్మ రేంజ్ అధికారి గణేష్ జలపాతం విశిష్టతలను వివరించారు. ఇందులో కుంటాల సెక్షన్ అధికారి వసంత్ కుమార్, బీట్ అధికారి సచిన్, భీమ్జి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని దులపల్లి ఫారెస్టు ఆకాడమికి చెందిన ఫారెస్టు బీట్ ఆఫీసర్‌లు (ఎఫ్‌బీవో) శిక్షణలో భాగంగా బుధవారం మావల శివారు ప్రాంతంలోని హరిత వనం పార్కును సందర్శించారు. పార్కు అభివృద్ధి, జంతువులపై, పక్షుల గురించి ఎఫ్ఆర్వో గులాబ్‌సింగ్ అవగాహన కల్పించారు. ఆయన వెంట డీఆర్‌వో గీత, ఎఫ్‌బీవో ప్రశాంత్, తదితరులున్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరానగర్‌లో ఈనెల 22న చోరీ జరిగింది. టూటౌన్ ఎస్సై జివి రమణారెడ్డి వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన పి.మల్లయ్య ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తోంది. ఇంట్లోని తన పర్సులో రూ.20వేల నగదుతో పాటు 9 గ్రాముల బంగారం ఉంచి ప్రతి రోజులాగే ఇంటికి తాళం వేసి పనికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న సమయంలో తలుపులు తెరిచి ఉండటం, పర్సు అక్కడ లేక పోవడంతో ఖంగుతింది. చోరీ జరిగిన విషయాన్ని చుట్టుపక్కల వారిని విషయాన్ని అడిగి తెలుసుకుంది. బుధవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రైనీ ఐఏఎస్ పర్యటన

బోథ్: మండలంలోని ధన్నూర్ బి, రఘునాథ్‌పూర్‌తో పాటు పలు గ్రామాల్లో శిక్షణ ఐఏఎస్ వికాస్ మహతో బుధవారం పర్యటించారు. శిక్షణలో భాగంగా గ్రామాల్లో అమలవుతున్న వివిధ పథకాల అమలును పరిశీలించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు వివిధ పథకాల లబ్ధిదారులతో మాట్లాడారు. అనంతరం పంటల నమోదును పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయంలో పహణీలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐ దశరథ్, జూనియర్ అసిస్టెంట్ పుష్పలత, స్వామి ఉన్నారు.

కలప స్మగ్లర్ల రిమాండ్

కడెం: ఇటీవల కలప స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడి న నిందితులను మంగళవారం తహసీల్దార్ ఎ దుట హాజరుపర్చినట్లు ఎఫ్ఆర్వో అనిత పే ర్కొన్నారు. కడెం రేంజ్ పరిధిలో పెద్దూర్, న వబ్‌పేట్ పరిధిలో కలపను అక్రమంగా రవా ణా చేస్తుండగా పట్టుబడిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇందులో డీఆర్వో సిద్దార్థ ఉన్నారు.

సౌండ్ మారిందా.. సైలెన్సర్ గోవిందా..!

- మార్కెట్లో విరివిగా లభ్యం
- అధిక శబ్దాలతో వాహనదారులకు, వృద్ధులపై ప్రభావం
- 126 సైలెన్సర్ల తొలగింపు.. జరిమానా



పట్టణంలోని శివాజీ చౌక్‌లో రోడ్డు రోలర్‌తో సైలెన్సర్లను తొక్కిస్తున్న డీఎస్పీ(ఫైల్)

నిర్మల్‌టౌన్: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇటీవల అధిక శబ్దాలతో వెళ్లే వాహనాల సంఖ్య పెరిగింది. దీంతో వాహనదారులతో పాటు వృద్ధులు తీవ్ర స్థాయిలో ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే శబ్దకాలుష్యంతో అవస్థలు పడుతున్నామని పలువురు పోలీస్‌స్టేషన్ మెట్లెక్కారు. దీంతో ఇటీవల పట్టణ పోలీసులు అలాంటి సైలెన్సర్లు అమర్చి వాహనాలు నడుపుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై కొరడా ఝులిపిస్తున్నారు.

కంపెనీ అమర్చిన సైలెన్సర్లు మార్చుతూ...

ద్విచక్ర వాహనానికి కంపెనీ అమర్చిన సైలెన్సర్లు మాడిఫై చేస్తున్నారా..? అయితే మీకు షాక్ ఇచ్చేందుకు పట్టణ పోలీసులు సిద్ధమయ్యారు. శబ్ద కాలుష్యంపై ప్రత్యేక దృష్టిసారించిన పోలీసులు అధిక శబ్దాలు చేసే వారి వాహనాల పని పడుతున్నారు. ఇష్టం వచ్చినట్లు శబ్ద కాలుష్యానికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారు. అలాంటి వారి వాహనాలు సీజ్ చేస్తున్నారు.

రోడ్డు రోలర్‌తో తొక్కిస్తూ..

అధిక సౌండ్ చేసే బైక్‌లను పట్టుకుని వాటి సైలెన్సర్లను తొలగించి పట్టణ నడి ఒడ్డున గల చౌరస్తాలో రోడ్‌రోలర్‌తో వాటిని పోలీసులు తొక్కించి నుజ్జునుజ్జు చేయిస్తున్నారు. 2023లో ఇప్పటివరకు 126 సైలెన్సర్లను తొలగించారు. ఇందులో నుంచి 100 ద్విచక్ర వాహనాలకు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. మిగతా 26 ద్విచక్ర వాహనాలను ఆర్టీవోకు అప్పజెప్పారు. దీంతో ఆర్టీవో ఒక్కొక్క వాహనానికి రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. కొన్ని ద్విచక్ర వాహనాలకు పలువురు నేటికీ అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లు పెట్టుకొని తిరుగుతున్నారు.



పట్టుకున్న సైలెన్సర్లతో ట్రాఫిక్ పోలీసులు (ఫైల్)



మార్కెట్లో దొరికే అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్

శబ్ద కాలుష్యంపై ఫిర్యాదులు..

ఖరీదైన ద్విచక్ర వాహనాలు నడిపేవారు అధిక శబ్దం వచ్చే సైలెన్సర్లు వాడుతున్నారని నిర్మల్‌లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి సైలెన్సర్లు వాడడంతో శబ్ద కాలుష్యంతో పాటు, వృద్ధుల ఆరోగ్యంపై ఎఫెక్ట్ పడనుంది. అంతేకాకుండా రోడ్డుపై వెళ్లే మిగతా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు కోరుతున్నారు.

విక్రయదారులపై చర్యలు శూన్యం..

మార్కెట్లో విచ్చలవిడిగా మెకానిక్ షాపుల్లో అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లు విక్రయిస్తున్నారు. మొదటగా సైలెన్సర్లు విక్రయించే షాపులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు పోలీసులను వేడుకుంటున్నారు. వారిపై చర్యలు తీసుకుంటే అమ్మడం ఆపేస్తారని సూచిస్తున్నారు. పోలీసులు వారిని కట్టడి చేస్తే ఎవరు అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లు అమర్చుకోలేరని వాపోతున్నారు.

మెకానిక్ షాప్‌లకు నోటీసులు



అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను అమర్చే మెకానిక్ షాప్‌లకు నోటీసులు పంపిస్తాం. అయినా వినకుంటే కేసులు నమోదు చేస్తాం. అధిక సౌండ్ వచ్చే సైలెన్సర్లను అమర్చుకునే ద్విచక్ర వాహనదారులకు మొదటిసారిగా జరిమానా విధించి తర్వాత కేసులు నమోదు చేసి కోర్టుకు పంపుతాం. శబ్ద కాలుష్యం ద్వారా జరిగే అనర్థాలకు ఎవరు కారణం కావద్దు. లేదంటే తగిన చర్యలు తీసుకుంటాం.

– గంగారెడ్డి, నిర్మల్ డీఎస్పీ

సౌండ్‌తో ఇబ్బంది అవుతుంది



సౌండ్ వచ్చే ద్విచక్ర వాహనాలతో పట్టణంలో చాలా ఇబ్బందికరమైన వాతావరణం నెలకొంది. మైనర్లు సైతం ద్విచక్ర వాహనాలకు సౌండ్ వచ్చే సైలెన్సర్లు బిగించి రోడ్డు మీద వెళ్లేవారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అలాగే ద్విచక్ర వాహనాలతో రోడ్లపై ఇష్టానుసారంగా నడుపుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. దీనిపై పోలీసులు సీరియస్‌గా వ్యవహరించాలి.

– శంకర్ యాదవ్, మంజులాపూర్

శ్రమదోపిడీ చేస్తున్న ప్రభుత్వాలను గద్దె దించాలి

- డీఎస్పీ జిల్లా అధ్యక్షుడు గణేశ్ మహారాజ్



మాట్లాడుతున్న గణేష్ మహారాజ్

కైలాస్‌నగర్: కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరిట శ్రమ దోపిడీకి పాల్పడుతున్న ప్రభుత్వాలను గద్దెదించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా, ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఉద్యోగుల సమ్మె శిబిరాలను బుధవారం ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు నియామకాల పేరిట కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో అధికారం చేపట్టిన సీఎం కేసీఆర్ నియామకాలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వ్యవస్థనే ఉండదన్న ముఖ్యమంత్రి ఉద్యోగ భద్రత కోసం రోడ్డెక్కి పోరాడుతున్న వారిని విస్మరించడం సిగ్గు చేటన్నారు. సమగ్ర శిక్షా, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా నాయకులు మంజూష, బర్కుంటి రాజీవ్, కరాడి గంగన్న, గొంటి ముక్కుల ఓమన్న, తోంటికూరు సంతోష్, బండారి సంతోష్ పాల్గొన్నారు.

సరిహద్దుల్లో నిఘా..

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం

ఉట్నూర్‌రూరల్: రానున్న సాధారణ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సరిహద్దుల్లో నిఘా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాన్ని ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీ కె. సురేశ్‌కుమార్, నిర్మల్ అదనపు ఎస్పీ వీరయ్యలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాతో సరిహద్దు కలిగిన పోలీస్‌స్టేషన్ అధికారులు రానున్న ఎన్నికల నేపథ్యంలో ఆయా జిల్లాల పోలీస్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాకు అక్రమ మార్గాల్లో అనుమతి లేని వాటిని అరికట్టే విషయంలో అంతర జిల్లా, రాష్ట్ర చెక్ పోస్టులు ఉపయోగపడతాయని తెలిపారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతరం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలోని మారుమూల గ్రామాలను నిరంతరం అధికారులు సందర్శిస్తూ మావోయిస్టుల ప్రాబల్యం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, ఆదిలాబాద్ డీఎస్పీ వి.ఉమేందర్, ఆదిలాబాద్ డీసీఆర్బీ అండ్ ఎలక్షన్ సెల్ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్, నిర్మల్ డీఎస్పీ ఏ.గంగారెడ్డి, ఆసిఫాబాద్ డీఎస్పీ కే.శ్రీనివాస్, కాగజ్‌నగర్ డీఎస్పీ ఏ.కరుణాకర్, నిర్మల్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సరిహద్దు సర్కిల్ ఎస్సైలు, సీఐలు పాల్గొన్నారు.



హాజరైన ఉమ్మడి జిల్లా డీఎస్పీలు, సీఐ,ఎస్సైలు



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

నిర్మల్: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా హైదరాబాద్ వరకు కేంద్ర ప్రభుత్వమే రైల్వేలైన్ నిర్మించడానికి ముందుకువచ్చిందని బీజేపీ శ్రేణులు హర్షం వ్యక్తం జేశాయి. ఈమేరకు కృతజ్ఞతలు చెబుతూ బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి నాయకులు క్షీరాభిషేకం చేశారు. పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని శివాజీచౌక్, గాంధీచౌక్, బుధవార్‌పేట్, నగరేశ్వర్‌వాడ, ఈద్గాం తదితర ప్రధాన కూడళ్లలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిర్మల్ ప్రజల కలను మోదీ సర్కారు నెరవేర్చనుందన్నారు. సగం వాటా ఇస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం ఏళ్లుగా పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కేంద్రమే ఆదిలాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆర్మూర్, బాన్సువాడ, సంగారెడ్డి, పటాన్‌చెరు వరకు రైల్వేలైన్ నిర్మించనున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు విన్నవించగా కేంద్రప్రభుత్వం వందశాతం పూర్తి నిధులతో రైల్వేలైన్ కేటాయించడం హర్షణీయమని పేర్కొన్నారు. బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, పెద్దపల్లి ఇన్‌చార్జి రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజు, రాజేశ్వర్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు సాదం అరవింద్, ఇన్‌చార్జి విలాస్ పాల్గొన్నారు.



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

అమ్మవారిని దర్శించుకున్న రష్మీఠాగూర్



ఆలయంలో పూజలు చేస్తున్న రష్మీఠాగూర్

భైంసా: మాజీ మిస్ ఇండియా, తెలంగాణ ఐటీ హబ్ బ్రాండ్ అంబాసిడర్ రష్మీ ఠాగూర్ బుధవారం కుటుంబసమేతంగా బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆమెకు స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేసి, అమ్మవారి శేష వస్త్రంతో ఆశీర్వచనాలు అందజేశారు.

గతేడాది కుమారుడికి.. ఈఏడాది తండ్రికి



ఉత్తమ అవార్డు అందుకుంటున్న తండ్రి రాములు



గతేడాది అవార్డు అందుకున్న కుమారుడు శివకృష్ణ

- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న తండ్రి, కొడుకులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు చిలుకూరి రాములు సుర్జాపూర్ పంచాయతీ పరిధిలోని బుడగజంగంవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ విద్యా సంవత్సరం ఉత్తమ బోధన చేసిన పలువురు ఉపాధ్యాయులను ప్రభుత్వం ఎంపిక చేయగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన రాములు మంగళవారం జిల్లా కేంద్రంలో మంత్రి ఐకే రెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. గతేడాది రాములు కుమారుడు శివకృష్ణ సైతం పెద్దపల్లి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం మోడల్‌స్కూల్‌లో పీజీటీగా శివకృష్ణ విధులు నిర్వహిస్తున్నాడు. తండ్రి, కొడుకులు అవార్డులు అందుకోవడంపై పలువురు అభినందిస్తున్నారు.

గడ్డిక్షేత్రాల పెంపకంపై అవగాహన


జన్నారం: అడవిలో వన్యప్రాణులకు సరైన ఆహారం అందించే గడ్డి క్షేత్రాల పెంపకంపై బుధవారం మహారాష్ట్రకు చెందిన గడ్డి క్షేత్రాల నిపుణుడు జీడి మురత్కర్ అధికారులకు అవగాహన కల్పించారు. కవ్వాల్ టైగర్‌జోన్ జన్నారం అటవీ డివిజన్ కేంద్రంలోని టీడీసీలో నిర్వహించిన కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, ములుగు, భూపాలపల్లి అటవీ సర్కిళ్ల నుంచి అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి వనరులు, పర్యావరణ పరిస్థితులు బాగున్న చోటే వన్యప్రాణులు నివాసం ఉంటాయన్నారు. వన్యప్రాణులు అధికంగా ఉన్న చోట పులి ఆవాసం ఏర్పాటు చేసుకుంటుందన్నారు. అనంతరం జన్నారం అటవీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పెంచుతున్న గడ్డి క్షేత్రాలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ లోకేశ్ జైశ్వాల్, ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్ ఆయనకు జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఎఫ్‌డీవో శివ్‌ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవో మాధవరావు, వివిధ సర్కిళ్లకు చెందిన 34 మంది ఎఫ్‌డీవోలు, 79 మంది ఎఫ్ఎస్‌వోలు, బీట్ అధికారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మురత్కర్

మొసలి పట్టివేత

కడెం: మండలంలోని పెద్దబెల్లాల్ చెరువులో మొసలి కనపడడంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అధికారులు చేరుకుని చాకచక్యంగా మొసలిని పట్టుకుని తాళ్లతో బంధించి కడెం ప్రాజెక్టులో వదిలిపెట్టారు. ఇందులో ఎఫ్ఆర్వో అనిత, ఎఫ్‌బీవో రవి ఉన్నారు.



పట్టుబడిన మొసలి

శతాధిక వృద్ధురాలు మృతి

నిర్మల్ రూరల్: మండలంలోని వెంగ్వాపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు తోడిషెట్టి లక్ష్మిబాయి(102) బుధవారం మృతి చెందింది. గ్రామంలోని అ త్యధిక వయస్సు ఉన్న మహిళ లక్ష్మిబాయి కావడం గమనార్హం. ఉమ్మడి కుటుంబంగా జీవిస్తున్న ఈమె కుటుంబంలో మొ త్తం 45మంది కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈమె కుమారులు అందరూ కూడా ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్నారు. మనవడు తోడిషెట్టి పరమేశ్వర్ జి ల్లా విద్యాశాఖలో నోడల్ అధికారిగా, మునిమనవ డు ప్రణయ్ అటవీశాఖలో రేంజ్ అధికారిగా, ముని మనవరాళ్లు హైదరాబాద్‌లోని ప్రముఖ కార్పొరేట్ ఆసుపత్రిలో డాక్టర్లుగా పనిచేస్తున్నారు. లక్ష్మిబాయి మృతిపై వెంగ్వాపెట గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సంతాపం వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ అధికారులపై ఫిర్యాదు

నిర్మల్: తనపై దాడి గతనెల 23న దాడిచేశారంటూ నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేటకు చెందిన కొండా మురళిగౌడ్, తమ గ్రామానికి సంబంధం లేని వ్యక్తులకు టీఎఫ్‌టీ లైసెన్సులను ఇచ్చారంటూ కుంటాల మండలం అందకూర్‌కు చెందిన సుంకరి శ్రీశైలంగౌడ్‌లు ఎక్సైజ్ అధికారులపై ఆ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు వారు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో పాటు నిర్మల్ సీఐపైనా ఫిర్యాదు చేశారు. వారిపై తగు చర్యలు తీసుకోవడంతో తమకు న్యాయం చే యాలని మంత్రి, హెచ్ఆర్‌సీని కోరినట్లు పేర్కొన్నారు.

పనుల పరిశీలన

కడెం: మండలంలోని కోలాంగూడలో చిక్కి యూనిట్, ఇప్ప పరక నూనె యూనిట్ పనులను కలెక్టర్ వరుణ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ రాజేశ్వరి, ఏపీడీ గోవిందరావు, ఏపీఎం రాజారాం, సిబ్బంది ఉన్నారు.

మాయమాటలు చెప్పి.. ఘరానా మోసం

- రెండు తులాల బంగారు గొలుసుతో ఉడాయించిన అపరిచితుడు
- బ్యాంకులో మరింత లోన్ ఇప్పిస్తానని మోసం



మోసపోయిన దంపతులు

లోకేశ్వరం: ఘరానా మోసగాడు దంపతులకు మాయమాటలు చెప్పి బంగారు గొలుసు కాజేసిన సంఘటన మండలంలోని కన్కపూర్ గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గోపు నాగన్న అనే రైతు ఇంటికి బుధవారం ఉదయం 11 గంటల సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పల్సర్ బైక్‌పై వచ్చాడు. నాగన్న–లక్ష్మి దంపతులతో నేను బ్యాంకు నుంచి వచ్చాను. మీరు ఇంతకు ముందు బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకున్నారుగా, మీకు లోన్ మాఫీ వచ్చిందని, మరింతగా రెట్టింపు లోన్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పాడు. నమ్మిన ఆ దంపతులు లక్ష్మి మెడలోని రెండు తులాల బంగారు గొలుసును భర్త నాగన్నకు ఇచ్చింది. నాగన్నను అతడి బైక్‌పై ఎక్కించుకుని అబ్దుల్లాపూర్ గ్రామ పరిధిలోని సబ్‌స్టేషన్ వరకు తీసుకెళ్లి అతడి వద్ద నుంచి గొలుసును లాక్కుని పరారయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.


విద్యుత్ ప్రమాదాలు నివారిద్దాం

నిర్మల్: భారీ వర్షాల నేపథ్యంలో టీఎస్ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు రైతులు, విద్యుత్ వినియోగదారులకు పలు భద్రతా సూచనలు చేశారని, వాటిని పాటిస్తూ విద్యుత్ ప్రమాదాలు నివారిద్దామని ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. తడి చేతులతో విద్యుత్ పరికరాలను, తీగలను ముట్టుకోవద్దన్నారు. బట్టలు ఆరవేసే దండేలకు విద్యుత్ వైర్లు తాకకుండా చూసుకోవాలన్నారు. ఇంట్లో పరిసరాల్లో అతుకుల వైర్లు ఉంటే ఎలక్ట్రిషియన్‌తో సరిచేయించాలని చెప్పారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరికి వెళ్లవద్దని, స్టార్టర్ డబ్బాలను నీటిలో తడవకుండా చూడాలని సూచించారు. ఆరుబయట విద్యుత్ స్తంభాలను తాకవద్దని హెచ్చరించారు. విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్లు 1800 425 0028 లేదా 1912కు ఫోన్ చేసి చెప్పాలని ఎస్ఈ సూచించారు.

దాడి ఘటనలో ఒకరికి జైలు

భైంసాటౌన్: దాడి చేసిన ఘటనలో ఒకరికి సాధారణ జైలుశిక్ష విధిస్తూ భైంసా కోర్టు న్యాయమూర్తి దేవేంద్రబాబు తీర్పు ఇచ్చారు. 2017లో భైంసా మండలం మాంజ్రి గ్రామానికి చెందిన గోనె రాందాస్ కోతుల్‌గాంకు చెందిన ఏనుగు గంగారెడ్డిపై వ్యక్తిగత కక్షలతో దాడిచేయగా, బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై భైంసా కోర్టు ఏపీపీ అరుణ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు రావడంతో జడ్జి నిందితుడికి మూడునెలల సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.





పరేషాన్ చేసిన పాముపిల్ల

అదో చిన్న పాముపిల్ల. కానీ.. ఓ బైకులో దూరి గంటపాటు అందరినీ పరేషాన్ చేసింది. జిల్లా కేంద్రంలోని పాత అర్బన్ తహసీల్దార్ కార్యాలయం పక్కన జిరాక్స్ సెంటర్‌కు పనిపై వచ్చిన ఓ వ్యక్తి తన బైక్‌ను అక్కడ నిలిపి ఉంచాడు. ఇంతలో ఈ పాముపిల్ల ఆయన బైకులోకి దూరింది. పక్కన ఉన్న దుకాణదారులు చూసి వెంటనే పాములను పట్టే ఫిరోజ్‌కు ఫోన్‌చేశారు. ఆయన వచ్చిన తర్వాత కూడా అరగంటపాటు పాముపిల్ల చిక్కకుండా బైక్ పెట్రోల్‌ట్యాంక్ కింద, వైర్లలో దాక్కుంది. చివరకు ఫిరోజ్ బండిని కింద పడుకోబెట్టి దాన్ని బయటకుతీశారు. దాదాపు గంటపాటు అక్కడున్న వారందరినీ పిల్లపాము పరేషాన్ చేసింది. వర్షాకాలంలో ఇలాంటి పాములు చాలా బయటకు వస్తాయని, జాగ్రత్తగా ఉండాలని ఫిరోజ్ తెలిపారు.

– నిర్మల్